# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 29-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతీయ స్ఫూర్తిని ప్రతిధ్వనించే అనేక భాషలు, మాండలికాలు దేశంలో ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ❖ వికసిత్ భారత్ సాధనలో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు ఘననీయమైన పురోగతిని సాధిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ ఆపరేషన్ సిందూర్ విజయంలో స్వదేశీ రక్షణ వ్యవస్థలు కీలక పాత్ర పోషించాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.
- ❖ వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ఒడిసాలో ప్రారంభించారు.

==============================

భారతీయ స్ఫూర్తిని ప్రతిధ్వనించే అనేక భాషలు, మాండలికాలు మన దేశంలో ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో సాహిత్య సదస్సును ఈరోజు ద్రౌపతి ముర్ము ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సాహిత్య అకాడమీకి రాష్ట్రపతి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు రోజుల సదస్సులో కవయిత్రిల సమ్మేళనం భారత స్త్రీవాద సాహిత్యం, సాహిత్యంలో పరివర్తన, ప్రపంచ దృక్పథంలో భారతీయ సాహిత్యం నూతన ప్రయాణం వంటి అంశాలపై పలు సెషన్‌లను నిర్వహిస్తున్నారు. దేవి అహల్యా బాయి హోల్కర్ గాథతో ఈ సదస్సు ముగుస్తుంది.

==============================

“వికసిత్ భారత్” సాధనలో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు ఘననీయమైన పురోగతిని సాధిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సిక్కిం రాష్ట్ర 50వ అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఆ రాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. దృశ్య మాధ్యమమం ద్వారా ప్రసంగించిన ప్రధానమంత్రి సిక్కిం

అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. సిక్కిం ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా మారనుందని పేర్కొన్నారు. హిమాలయ రాష్ట్రమైన సిక్కిం దేశానికి గర్వకారణమన్నారు. సిక్కిం ప్రజలు ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తారని, సాహస క్రీడలకు కేంద్రంగా మారే అవకాశాలు సిక్కింకు పుష్కలంగా ఉన్నాయన్నారు. దేశాన్ని వికసిత్ భారత్ గా మార్చడానికి దేశంలోని ప్రతీ రాష్ట్రం సమతుల్య అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి పేర్కొంటూ....

(వాయిస్ 34 సెకన్లు)

కాగా నాలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా సిక్కిం అవతరణ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించాల్సి ఉంది. అయితే, వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ పర్యటన రద్దవడంతో పశ్చిమ బెంగాల్ వెళ్లిన ప్రధానమంత్రి అలీపుర్దువార్ లో నగర ఆధారిత గ్యాస్ పంపిణీ ప్రాజెక్టుకు ఈరోజు శంకుస్థాపన చేశారు. 1,017 కోట్ల రూపాయల విలువైన ఈ ప్రాజెక్ట్ తో పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్దువార్, కూచ్‌బెహార్ జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... భారత ఆర్థిక వ్యవస్థ గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు పురోగమిస్తోందని అన్నారు. ఇకపై ఇండ్లలో గ్యాస్ సిలిండర్ల అవసరం ఉండదని, ఎల్‌పిజి గ్యాస్ ని పైప్‌లైన్ ద్వారా నేరుగా వంటగదికి పంపిణీ చేస్తామన్నారు. భవిష్యత్ లో పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

==============================

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదంపై భారత్ చర్యలలో మేక్-ఇన్-ఇండియా కీలక పాత్ర పోషించిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన CII వార్షిక వ్యాపార సదస్సులో కేంద్రమంత్రి ప్రసంగిస్తూ... ఆపరేషన్ సిందూర్ విజయానికి స్వదేశీ రక్షణ వ్యవస్థలే కారణమన్నారు. ఫైటర్ జెట్లు, క్షిపణి వ్యవస్థలను నిర్మించడంతో పాటు.. కొత్తతరం యద్ధ సాంకేతికతలపైనా దృష్టి సారించామన్నారు. ఇక పాకిస్తాన్‌తో చర్చలలో కేవలం ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ అంశాలు మాత్రమే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. పీఓకేలో ప్రజలు భారత్‌లో విలీనం కావాలని కోరుకుంటున్నారని, అక్కడున్నవారికి భారతదేశంలో దృఢమైన సంబంధాలున్నాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

==============================

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ఒడిశాలోని పూరి జిల్లాలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 2 వేల మంది శాస్త్రవేత్తలు రైతులను ప్రత్యక్షంగా కలిసి ఆదాయాన్ని రెట్టింపు చేసుకొనే పలు సూచనలు, సలహాలు అందిస్తారన్నారు. అదే విధంగా అధిక దిగుబడులు ఇచ్చే అనువైన పంటలు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. 'ప్రయోగశాల నుండి వ్యవసాయ క్షేత్రం వరకూ గల సంబంధాన్ని బలోపేతం చేయడానికి విజ్ఞాన కేంద్రాల నిపుణులు, భారత వ్యవసాయ పరిశోధన మండలి (ICAR) శాస్త్ర వేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రచారంలో భాగంగా 15 రోజుల పాటు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దాదాపు 20 రాష్ట్రాలలో పర్యటించనున్నారు.

విరామం

==============================

భారతదేశ రక్షణ రంగంలో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్ద ఎత్తున ప్రవేశపెడుతున్నామని భారత వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన CII శిఖరాగ్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్వదేశంలో తయారీ అయిన రక్షణ సామగ్రిని వినియోగించాలని భారత్ దృఢ సంకల్పంతో

ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్ భవిష్యత్తులో భారత్ కు ఏమి అవసరమో అనే దానిపై స్పష్టతనిచ్చిందన్నారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (AMCA) రక్షణ రంగంలో ఒక సాహసోపేతమైన అధ్యాయమని పేర్కొన్నారు. దేశం అత్యంత ఖచ్చితమైన సామర్థ్యాల యుగంలోకి అడుగుపెడుతోందని అమర్ ప్రీత్ సింగ్ పేర్కొంటూ....

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పర్వత ప్రాంతాలలో కొండచర్యలు విరిగిపడకుండా నిరోధించడానికి అధునాతన పద్ధతులను అవలభించవలసిన అవసరం ఉందని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో భౌగోళిక సాంకేతికతపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... కొండ ప్రాంతాలలో వాలు స్థిరీకరణ, రాళ్ళు పడటం తగ్గించడంలో ఇతర దేశాలు అనుసరిస్తున్న అధునాతన జియోటెక్నికల్ పద్ధతులపై ఆధ్యాయనం చేయాలన్నారు. భారతదేశం విభిన్నమైన వాతావరణతో పాటు, భౌగోళిక పరిస్థితులతో కూడిన విభిన్న భూభాగాలను కలిగి ఉంటుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాకిస్తాన్ ఉగ్రవాదానికి తన మద్దతును విరమించుకునే వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేయబడుతుందని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రోజు న్యూఢిల్లీలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, పాకిస్తాన్‌తో సంబంధాలపై భారత్ స్పష్టమైన వైఖరితో ఉందని, ఉగ్రవాదం, చర్చలు ఒకేసారి కలిసి సాగలేవన్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఖాళీ చేసి, ఆ భూభాగాన్ని భారతదేశానికి అప్పగించిన తర్వాత మాత్రమే జమ్మూ కాశ్మీర్‌పై చర్చలు జరుగుతాయని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మారుమూల ప్రాంతాలు మొదలుకొని ప్రపంచ దేశాలకి సంబందించిన రోజువారీ విశ్వసనీయమైన సమాచారాన్ని ప్రసారభారతి షబ్ద్ పోర్టల్ వార్తా కథనాల రూపంలో ఉచితంగా అందిస్తోంది. అనేక అంశాలకు సంబందించి రోజుకి 800కి పైగా వార్తా కథనాలను 15 భాషల్లో షబ్ద్ పోర్టల్ ద్వారా వీక్షించవచ్చు. అయితే ఈ షబ్ద్ పోర్టల్ లోని సమాచారాన్ని కంటెంట్ క్రియేటర్స్, యూట్యూబర్స్ మొదలుకొని ఇప్పుడు ఎవరైనా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఎటువంటి కాపీ రైట్స్ సమస్యలు ఉండవని ప్రసారభారతి ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో భాగంగా ఈరోజు పంజాబ్ కింగ్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్ జట్ల మధ్య తొలి క్వాలిఫయర్‌లో క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేస్తున్న పంజాబ్ కింగ్స్ జట్టు 10 ఓవర్లు పూర్తయ్యే సరికి 7 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =